బుక్ కాకమానరు. మన నిర్మాతలు వారిపై ఆధారపడకా మానరు. ఒకవేళ నిర్మాతలకు స్వతంత్రభావాలున్నా, వారిని శాసించగల డిస్ట్రిబ్యూటర్లు ఈ తారలను బుక్ చెయ్యకపోతే డబ్బివ్వరు.

స్క్రిప్టు ముందుగా తయారు చేసుకోవటానికీ తారలకూ సంబంధంలేదు. స్క్రిప్టులు పక్కాగా తయారు చేసుకుని, మిగిలిన ప్రయత్నాలన్నీ చేసుకుని పని ప్రారంభిస్తే తారలను నియోగించినా పని చకచకా జరగకపోదు. కాని అటువంటి స్క్రిప్టులు మన పరిశ్రమలో లేవు.

నిమిషానికి రూపాయిని మించిన కిమ్మతుగల గల కాల్‌షీట్ కాలంలో మన సెట్లమీద నటులు సంభాషణలు కంఠస్థం చెయ్య నారంభిస్తారు, డైరెక్టరు షాట్ టేకింగ్ ఆలోచిస్తాడు, టేక్‌ల మధ్య కామెరామాన్ లైట్లు సర్దుతాడు, షాట్ కోసం ప్రొడక్షన్ ప్రాపర్టీలకోసం కారుమీద బయలుదేరుతాడు! నటులు ఆలస్యంగా వచ్చి కాల్‌షీట్ రెండు గంటలు జరిగాక మేకప్ రూమునుంచి బయటపడటం సంగతీ, అప్పటికే వరసగా రెండు కాల్‌షీట్లుచేసి వాడిపోయిన మొహంతో, బిగుసుకుపోయిన గొంతుతో మూడో కాల్‌షీట్ చెయ్యటానికి వచ్చే సంగతీ వేరే చెప్పనవసరమే లేదు.

“మన దేశంలో ఎన్ని చిత్రాలు ముహూర్తం జరిగి ప్రారంభం కాకుండా పోతున్నాయి! ఎన్ని చిత్రాలు సగం తీసి నిలిచిపోతున్నాయి! బయటపడని చిత్రాలమీద ఎంత డబ్బు, ఎంత ఫిలిం, ఎంత శ్రమవ్యర్థమవుతోంది! ఇది ఇంకే దేశంలోనూ కానం. మరే దేశంలోనైనా చిత్రం ప్రారంభిస్తే అది పూర్తి అయ్యే పూచీ ఉంది. ఈ దేశంలోనే అటువంటిదేమీ లేదు” అన్నారు పటేల్‌గారు.

ఇటువంటి పరిస్థితులు సవాలక్ష మారిననాడే ఇక్కడ కూడా చెప్పుకోదగిన సినిమా పరిశ్రమ ఏర్పడి వ్యాపారపద్ధతుల పై నడవగలుగుతుంది.

---

స్కెచ్

# కందళించిన నివ్వెఱ

కె. రామలక్ష్మి

ముఖం చూడగానే మనిషి తత్వం ఎలాంటిదో అర్థం అయిపోతుందనుకోడం ఉత్త అమాయికత్వం. నిండుకుండలా తొణకనిమనిషి హృదిలో ఏ పోరుగాలి పెనవైచుకొనివుందో! ఉత్తినే చాదస్తంగా వాగే వ్యక్తి హృదయం అతి ప్రశాంతంగా వుండచ్చు-దాల్లో వింతేముంది! కొన్ని రోజులక్రితంవరకూ నేనూ బాహ్యస్వరూపాన్ని పట్టి ఆంతరంగిక పరిస్థితులను కొలిచేదాన్ని కాని నాదెంత తెలివి తక్కువో అర్థమవడానికి ఎన్నో రోజులు పట్టలేదు...

* * *

“ఏమిటివాళ యిలావుంది? ఎప్పుడూ ఎంతో హాయిగావుండే నాకెందుకిలావుంది?” అని శూన్యంలోకి చూస్తూ నించున్న పార్వతికి లక్ష్మిరాక తెలియనేలేదు. తన బుజంపటుకు ఆమెవైపునకు తిప్పుకున్నాకే-లక్ష్మివచ్చిన విషయం తెలిసింది.

“ఏంలక్ష్మి ఏమిటో విశేషం వున్నట్టుందే!”

“మరెందుకొచ్చాననుకున్నావు పార్వతీ, మా అన్నయ్యొచ్చాడు. ఇల్లంతా ఒకటే హడావిడి అనుకో. సరేకాని, నువ్వివాళ మా యింటికి వస్తావా?”

“ఒక్క మనిషి వస్తే అంత హడావిడి దేనికి లక్ష్మి” కొంటెగా అడిగింది తను.

“ఒకసారి రద్దూ నీకే తెలుస్తుంది. యిప్పుడు నేను త్వరగాపోవాలి. వస్తావు కదూ?”...వస్తానని ఎలాగో అనేసింది. యీ లక్ష్మి సుడిగాలిలాంటిది. అతి వేగంగా జీవితపథంలో ప్రయాణం సాగించుకుంటూ పోతూన్న చిన్నారి...

వారంరోజులు ఎలాగడిచిపోయాయో ఎవరికీ తెలియలేదు. ఆరాత్రి అతను వెళ్ళిపోతాడనగానే

ఉలిక్కిపడ్డట్టయింది తనకి. నిజంగానా? తనని తనే ప్రశ్నించుకుంది. అతను వెళ్ళిపోతే ఎలాగ? ఎన్నడూ లేనిది తనకి ఎంతో భయం వేసింది. ఎవరు సాయం లేనట్టు అనిపించింది. ఆనాటి సాయంత్రం-

"లక్ష్మీ..." ఏం అన్నట్టు తిరిగి చూసింది లక్ష్మి. ఆ చూపులోనే సర్వం అర్థంచేసుకున్నట్టు చిరునవ్వు నవ్వింది.

"చూడు పార్వతీ, నేనూ మీ ఆయనా రెండాటలు చదరంగం ఆడతాం. అన్నయ్య ఏదో కొనుక్కోవాలన్నాడు- కొంచం తోడు వెడతావూ" అని తన సమాధానం కోసమేనా ఆగకుండా, "రా రామ్మూర్తీ" అంటూ ఆయనని హాల్లోకి తీసుకుపోయింది లక్ష్మి.

గుమ్మానికి జేరబడి, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడతను- ఆ సిగరెట్టు కాల్చడమే పరమావధిగా-అతి జాగ్రత్తగా పొగ పీలుస్తున్నాడు.

"బజారుపని వుందటగా...అయితే ఈ రాత్రి నిజంగా వెళ్ళిపోతావా?" ఎన్నెన్నో అడుగుదాం, చెపుదాం అనుకున్న తనకి యీ మాటలు వచ్చాయి...ఇద్దరూ నడిచినడిచి సముద్రతీరం చేరారు. ఎక్కడి బజారు ఎక్కడి సముద్రతీరం! నవ్వుకుంది పార్వతి "చూడు పార్వతీ"

చూడక తనేం చేస్తుంది? నువ్వసలు వెళ్ళిపోవద్దు నువ్వెళ్ళిన మరునాడు నేనీ వూళ్ళో వుండలేను - ఏమేమిటో చెప్పేసుకుంటోంది మనస్సు.

"అప్పుడే ఆరు దాటుతోంది. ఇంకో రెండు గంటల్లో నువ్వెళ్ళిపోతావు. మళ్ళీ నిన్ను చూడను" అనేసి ముఖం చేతుల్లో దాచుకుంది. అతను చేతులు తీసేశాడు. అవును, మళ్ళీ చూడను, ఆ ఆలోచన ఆమె అంతరాంతరాలో రేకెత్తి, మైకం కమ్మినట్టయింది. ఓ క్షణం అతని బుజం మీద తల వాలించింది పార్వతి. ఈ కొద్దిరోజుల పరిచయంతోటే...అతని సర్వస్వాన్ని వ్యాపించిన లవండరు వాసనా, సిగరెట్టు వాసనా... తన కెంత సన్నిహితం అయిపోయాయి! ఉప్పొంగుతున్న కన్నీటిని కాదని అతన్ని ఓసారి చూడడానికి కళ్ళు తెరిచింది. ఇదేమిటి? యింత సంతోషంగా వుండీ ఎందు కేడుస్తున్నట్టు తను?

బుజంమీద చేయివేసి దగ్గరగా తీసుకున్నాడు. "నువ్వెళ్ళిపోయాక, యింక నే నుండను. నీ కిది అర్థం కాదు" అందామని. కాని మాట రాలేదు. అతని మీద కొంచెం జాలి కలిగిందికూడా-అతనూ ఇలాగే అనుకుంటాడు. ఇప్పుడు కాదు, రైల్లో కూర్చున్నాక. ఏం లాభం? అలా ఎంతసేపు కూర్చుంటే మటుకు ఏం లాభం? తొమ్మిది దాటితే వెళ్ళిపోవాలి. అతని చేతుల్లో వుంటే తను తను కాదు. ఆనందంతో అసహాయురాలిగానూ... పూర్తిగా రూపాంతరం చెందుతుంది తను.

ప్రేమంటే ఏమిటో ఎప్పుడూ తను తెలుసుకోలేదు. ఆ ప్రయత్నమే చెయ్యలేదు తను. నిజానికి తనకి అలాంటిది ఒకటుందనే నమ్మకమే లేదు. పత్రికలలో పడే విషాదపూరిత ప్రేమగాథలు చదివింది తను. తన భర్త ప్రేమకోసం ఖూనీ చేసినవాళ్ళ తరఫున వాదించుతాడని కూడా తెలుసు. నవలలూ, నాటకాలూ, సర్వస్వం యీ ప్రేమ కలాపాలకి ఆటపట్టులనీ తెలుసు తనకి. కనీకనిపించని ఏహ్యాంభావంతోటీ, వింతతోటీ.... ప్రేమ అన్నది ఉత్త ఊహామాత్రమే అని తనలో తను ఎన్నోసార్లు నవ్వుకుంది. తన భర్త తనని ప్రేమిస్తాడు. తనతన్ని ప్రేమిస్తుంది. వారిద్దరి మధ్యా ఉద్రేకపూరిత ప్రేమకలాపాలకి తావు లేదు మరి ప్రేమ పేరెత్తితేనే, ఉద్రేకభావాలతో, విపరీతమైన సానుభూతితో...ఏమిటీ గొడవంతా! అనుకునేది తను. తన స్నేహితులు కొందరిని చూసింది: ఎడబాట్లు, విరహం, కన్నీళ్లు, యివన్నీ చూసి, వారంతా తనకి తెలియని ఏదో ఆట ఆడుతున్నారనుకునేది. అతను వచ్చేదాకా అలాగే అనుకుంది తను. కాని అప్పటినుంచీ తను, వింతగా అనుకున్నదీ, అర్థంకానిదీ నిజమై, కొత్త కొత్త అర్థాలతో వెలిగి పుష్పించింది. వెనకాలోచనేనా లేకుండా తను దానికి వశమయిపోయింది. ...తన అవస్థ చూస్తే...విపరీతంగావుండీ, యింక వేరు దిక్కులేని అసహాయ స్థితిని గుర్తుకి తెచ్చింది.

"ఎన్నాళ్ళుంటావు?" అని తను అతన్ని వారం రోజుల క్రితం అడగడం జ్ఞాపకంవచ్చింది.

"మహా వుంటే ఓ వారం" అన్నాడతను. ఒక వారం అన్నమాట—అనుకుంది తను. ఈ కొత్త వెలుగు మరణశిక్ష వేసుకునే పుట్టింది. మానవ

సంచారంలేని ఏ లోకంలోనో అయితే ఒకవారం—ఒక అనంతం. కాని యీవూళ్ళో, యీ మనుషుల మధ్య, యీ గందరగోళంలో...రోజులు శూన్యంలోకి అతివేగంగా పరుగెట్టిపోయాయి-ఏకాంతంగా వుండాలనే తీవ్రమైన ఆకలిలో గడిచిపోయాయి-అన్నీ చెప్పాలనీ, అన్నీ అనుభవించేయాలనే బాధతో-యిట్టే గడిచిపోయాయి. ఎవరూ చూడని ఒక కౌగిలింత; సినిమాలో సన్నిహితత్వం. అంతే. ఒక్కగంట అతని భుజంపై ప్రశాంతంగా వుండగల్గితే! ఒకే ఒకగంట-స్మృతిపథంలో అనుభవాలు మెరుపులు—ఎంతట్లో గడిచిపోయింది ఒక్కవారం!

"ఇంక మనం లేవాలి ఎనిమిది అవుతోంది" సిగరెట్టు వెలిగించడానికి అగ్గిపుల్ల గీశాడు. అదొక ఆనందం-ఆ వెలుగులో ఒకసారి, ఆఖరిసారి అతని ముఖం చూడగల్గడం.

ఇంటికి వెళ్ళేసరికి లక్ష్మి అంతా సిద్ధం చేసింది-అతని ప్రయాణానికి. ఆయన చదరంగం బల్లకేసి దీర్ఘంగా ఆలోచనలో మునిగి చూస్తూనేవున్నారు.

"ఏం పార్వతీ అన్నయ్యని దిగబెట్టి వద్దాం వస్తావా?" అప్రయత్నంగా తను ఆయనకేసి నడిచింది. "మీరూ వస్తారా?"

"నేనెందుకులే. మీ యిద్దరూ వెళ్ళండి."

"రా పార్వతీ, నాయిల్లు మీఆయన కాపలా కాస్తాడులే కాస్సేపు. ఏంరామ్మూర్తీ?" అంటూనే లక్ష్మి, జబ్బపట్టుకు అవతలకి తీసుకుపోయింది. కారు యిట్టే స్టేషను చేరింది. ఎంత త్వరగా వచ్చేసింది! ఎంతత్వరగా అంతా-అంతా ముగిసిపోయింది!

"ఎలా వున్నాడు మాఅన్నయ్య?" కొంటెగా ప్రశ్నించింది దారిలో లక్ష్మి.

"బాగానేవున్నాడు. అయినా అప్పుడే వెళ్ళిపోయాడేం?" అనలేకుండా వుండలేకపోయింది.

"చెప్పానుగా-వాడొస్తే అంతే. అంతా హడావిడి. సుడిగాలి." అంటూ నవ్వింది లక్ష్మి.

"నిజమే." అంది తను. కాకుంటే?...

ఇల్లు చేరిందన్నమాటేగాని హృదయంలో తుఫానురేగి, అశాంతి రేపింది. అర్ధరాత్రివేళ కళ్లు తెరిచిచూస్తే, ప్రశాంతంగా నిద్రిస్తూన్న ఆయన ముఖం కనిపించింది. తనకెందుకు నిద్రపట్టదు? అతనేడీ? ఎక్కడికెళ్ళిపోయాడు? శరీరం అంతా ఏదో బరువుగావుంది. హృదయం ఏదో తెలియని బాధతో మూల్గుతోంది. అప్రయత్నంగానే, ఆయన భుజంపై చేయేసి తిరిగి కళ్లు మూసింది.

* * *

ఈమె పార్వతి. నిండుకుండ-అసలు తొణకని మనిషి. అంతరాంతరాలలో జరిగిన కథనం యిది. చూడ్డానికి పార్వతి ఎంతో ప్రశాంతంగా వుంటుంది. లక్ష్మిని అడుగుతే చెప్తుంది: పార్వతిని గురించి. ప్రేమా విరహం అంటే వేళాకోళం చేస్తూ...లాయరుగా పేరు ప్రఖ్యాతులుగాంచిన భర్తతోటీ, ముత్యాల్లాంటి యిద్దరు పిల్లలతోటీ హాయిగా కాలక్షేపం చేస్తున్న గృహిణి. పైకి ఎంతో హాయిగావుండే పార్వతి హృదయం దేనికోసం తపించిందో, అవకాశం దొరకగానే, ఎలా స్పందించిందో-ఆశ్చర్యం వేస్తుంది.

"మానవమాత్రులంతా యింతే, అవకాశం లేకగాని" అంటారు స్నేహితులు. కాని "అలా అనడం అన్యాయం. అవకాశం కాదు కావలసింది. గడి జీవితపు సంకుచిత సరిహద్దుల ఒత్తిడి. దానితో హృదయం మోదుపడుతుంది. ఏం చేస్తారు?" అని నేనంటే, నావన్నీ విపరీత భావాలంటారు. కొంచెం ఆలోచించిచూస్తే...

